ప్రాణాలను నిలబెడుతున్న రక్తదాతలు

నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం


బ్లడ్ క్యాంపులో రక్తదానం చేస్తున్న ఏఎన్‌పీకే ఫౌండేషన్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: అత్యవసర సమయంలో రక్తదానం చేస్తూ రక్తదాతలు ప్రాణాలను కాపాడుతున్నారు. ఇలాంటి రక్తదాతలకు గుర్తింపునిస్తూ జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవంగా జరుపుతున్నారు. రక్తంలోని ఏ,ఓ,బీ, ఏబీ బ్లడ్ గ్రూపులను కనుగొన్న కార్ల్ లేండ్ స్టీనర్ జ్ఞాపకార్థం అతను జన్మించిన రోజు జూన్ 14 కావడంతో ఆ రోజును రక్తదాతల దినోత్సవంగా జరుపుకుంటున్నారు. శరీరంలో రక్తం తక్కువగా ఉండడం, ప్రమాదాలకు గురైన వాళ్లు అనేక మంది సమయానికి రక్తం అందకపోవడం వల్ల మృత్యువాత పడుతున్నారు. గతంలో రక్తం ఇస్తే ఇంకేముంది మనిషికి నీరసం వచ్చేస్తుందనే అపోహలు ఉండడంతో రక్తదానం చేయడానికి పెద్దగా ముందుకు వచ్చేవా రు కాదు. కానీ నేడు సోషల్ మీడియా వేగంతో అనేక మంది యువకులు, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు, సినీ హీరోల అభిమానులు ఇలా ఎందరో ముందుకు వచ్చి రక్తాన్ని దానం చేసి అనేక మంది ప్రాణాలు కాపాడుతున్నారు.

పెరిగిన అవగాహన

చాలా మంది యువకులు సోషల్ మీడియా ద్వారా రక్తదాతలను సంప్రదిస్తూ ఆపదలో అండగా నిలుస్తున్నారు. ఎవరైనా ప్రమాదానికి గురైన, గర్భిణీల ఆపరేషన్ గాని, ఇతర అనారోగ్యాల కారణాల వల్ల రక్తం అవసరమైతే ఎవరో ఒకరి ద్వారా ఆ సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. దాంతో ఏ బ్లడ్ గ్రూపు కావాలో ఆ గ్రూపు కావాలంటూ సోషల్ మీడియా ద్వారా స్పందించి వేగంగా ఆ సమాచారాన్ని ఒకరి నుంచి ఒకరికి చేరవేస్తూ చివరకు ఎవరినో ఒకరిని పట్టుకుని అవసరమైన బ్లడ్ గ్రూపును సేకరించి వారి ప్రాణాలను కాపాడుతున్నారు. గతంలో తమ ప్రాంతాల్లో ఉన్నవారినో బంధువర్గంలో ఉన్న వారినో రక్తం అడిగేవారు. నేడు సొంత ఖర్చులతో జిల్లాలు, రాష్ట్రాలు దాటి కూడా రక్తదానం చేయడానికి యువత ముందుకు రావడం హర్షణీయమని వైద్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

2019 నుంచి సేవలు



2019 సెప్టెంబర్ 2న ఏఎన్‌పీకే ఫౌండేషన్ పేరున 10 మంది సభ్యులతో రిజిస్ట్రేషన్ చేయించి అప్పటి నుంచి రక్తదానం చేయడం ప్రారంభించాం. మరో 15 మంది సభ్యులు తమతో వలంటీర్‌గా కలిసి పని చేస్తున్నారు. దాంతో ఇప్పటి వరకూ 1500 మంది సభ్యులతో దాదాపుగా 3500 యూనిట్లు రక్తం అందించాం. ప్లేట్‌లెట్స్ ఇవ్వడాన్ని సింగిల్ డోనర్ అంటారు. ఇలా ఇప్పటి వరకూ 150 మందికి ప్లేట్‌లెట్స్ అందజేశాం.

– చెన్నంశెట్టి సాయి, ఏఎన్‌పీకే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, పాలకొల్లు

1994 నుంచి రక్తదానం



చిరు ఫ్యాన్స్ తరఫున 1994 నుంచి రక్తదానం చేస్తున్నాము. ఇప్పటికి 27 క్యాంపులు నిర్వహించి వేలాది మందికి రక్తదానం చేశాం. నేను 9 సార్లు రక్తదానం చేశాను. మా ఫ్యాన్స్ ద్వారా 240 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో ప్రతి ఒక్కరూ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తుంటారు. అత్యధికంగా 30 నుంచి 60 సార్లు రక్తదానం చేసిన సభ్యులు సుమారు 60 మంది ఉన్నారు.

– తులా రామలింగేశ్వరరావు, రాష్ట్ర చిరు ఫాన్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శి

58 సార్లు రక్తదానం చేశాను



నా బ్లడ్ ఏబీ పాజిటివ్ ఇప్పటికి 58 సార్లు రక్తదానం చేశాను. ఎప్పుడు ఎవరికి ఎక్కడ అవసరమైతే అప్పుడు అక్కడకి వెళ్లి రక్తదానం చేస్తుంటాను. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తం ఇస్తుంటాను. రక్తదానం చేసిన తరువాత ఆ రోగి బంధువుల కళ్లల్లో ఆనందం ఇచ్చిన సంతోషం ఏ పని చేసినా రాదు.

– మంద రామారావు, వైండింగ్ వర్క్

క్లుప్తంగా

వైభవంగా వినాయక ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేకాలకరణలో సంపత్ వినాయకుడు

యలమంచిలి: మండలంలోని మేడపాడు గ్రామంలోని ఏవీఆర్ నగర్‌లో నిర్మించిన సంపత్ వినాయక ఆలయం మూడవ వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు యేడిద నరసింహాచార్యులు బ్రహ్మత్వంలో లక్ష్మీ గణపతి హోమం, అనంతరం సిద్ధి బుద్ధి సమేత సంపత్ గణపతి కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అఖండ అన్నసమారాధన ఏర్పాటుచేశారు. సాయంత్రం దేవేరులను పల్లకీలో ఉంచి గ్రామోత్సవం చేశారు. రాత్రి పుష్పోత్సవం నిర్వహించారు. గ్రామానికి చెందిన అడబాల వెంకట ఖాళీ ప్రసాద్, శంకర పార్వతి దంపతులు పీటలపై కూర్చుని ఈ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు కొమ్మిరెడ్డి ఉదయ భాస్కరరావు, పిల్ల పద్మారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ


విద్యార్థినులకు సైకిళ్లు అందిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పేద విద్యార్థులకు ప్రభుత్వంతో పాటు సేవా సంస్థలు కూడా సహాయ సహకారాలు అందించి విద్యార్థుల విద్యా ప్రగతికి దోహదపడాలని వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు అన్నారు. గురువారం స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇద్దరు విద్యార్థులకు రెండు సైకిళ్లను అందజేశారు. సుధాకరరావు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు విద్యకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంలో వాకర్స్ క్లబ్ ముందుంటుందని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్‌సాహెబ్, ట్రెజరర్ పోతుల ఉమాశంకరరావు, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, సలాది రామచంద్రరావు, ధనాని శ్రీరామూర్తి పాల్గొన్నారు.

ప్రధానికి వీడ్కోలు పలికిన కబర్థి


ప్రధాని మోదీతో ఉన్నమట్ల కబర్థి

పాలకొల్లు అర్బన్: వికసిత్ భారత్ లక్ష్యంగా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నందుకు ప్రధాని నరేంద్రమోదీకు ధన్యవాదాలు తెలిపానని బీజేపీ కృష్ణా జిల్లా ఇన్‌చార్జ్, పాలకొల్లు ఏఎంసీ మాజీ చైర్మన్ ఉన్నమట్ల కబర్థి గురువారం స్థానిక విలేకరులకు తెలిపారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారానికి హాజరైన ప్రధాని నరేంద్రమోదికి తిరుగు ప్రయాణంలో గన్నవరం విమానాశ్రయం వద్ద కబర్థి వీడ్కోలు పలికారు. దేశ ప్రధాని నరేంద్రమోదీకి వీడ్కోలు పలికే పది మంది కమిటీ సభ్యుల్లో తాను ఒకరిగా నిలవడం ఆనందంగా ఉందని కబర్థి తెలిపారు.

అనాథకు అంత్యక్రియలు


వృద్ధురాలి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్/పాలకొల్లు సెంట్రల్: విశ్వ మానవ వేదిక వృద్ధాశ్రమంలో జీవనం సాగిస్తున్న సానబోయిన భవాని (70) గురువారం మృతి చెందింది. ఆమెకు కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో విశ్వమావన వేదిక చైర్మన్ మల్లుల సురేష్ అతని మిత్ర బృందం పాలకొల్లులో శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు. భవాని గత కొంతకాలం నుంచి వృద్ధాశ్రమంలోనే ఉంటోందని, కనీసం ఆధార్ కార్డు కూడా ఆమెకు లేదని సురేష్ తెలిపారు. అనారోగ్యంగా ఉండడంతో పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించామన్నారు. అక్కడ చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారన్నారు. గుంపుల రవి, డా.మల్లుల జ్ఞానేశ్వరి, కోళ్ల సింహాద్రి, మల్లుల గిరీష్ అంత్యక్రియలు నిర్వహించారు.

తండ్రి కనిపించడం లేదని కుమారుడి ఫిర్యాదు

భీమవరం: భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని చినపేటకు చెందిన రెడ్డి త్రినాథ్ కనిపించడం లేదని అతని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఏఎస్ఐ రామకృష్ణ గురువారం చెప్పారు. కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 6న త్రినాథ్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ దొరక్క పోవడంతో త్రినాథ్ కుమారుడు పోలీసులను ఆశ్రయించాడు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసాపురం రూరల్: మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ బళ్ల సురేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసాపురం సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం సారవ, లక్ష్మణేశ్వరం, రాజుల్లంక, దర్బరేవు, రుస్తుంబాద, బల్లకట్టు, గాంధీబొమ్మ, కృష్ణబాబు కాలనీ, కొత్త కాలువ ఏరియాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. అంతరాయం విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: విద్యుత్ మరమ్మతులతో పాటు ట్రీ కటింగ్‌లో భాగంగా శుక్రవారం పట్టణంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు నరసాపురం విద్యుత్ శాఖ ఈఈ బి.సురేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 8 గంటల నుండి మద్యాహ్నం 1 గంట వరకూ ఏపీఎస్ఎస్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, లజపతిరాయ్‌పేట, బద్దావాని పేట, సోమేశ్వర అగ్రహారం, పూలపల్లి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

అపుస్మా జోన్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్


గొర్ల శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: ఆంధ్ర ప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) జోన్ ప్రెసిడెంట్‌గా గురుకుల విద్యాలయ చైర్మన్ గొర్ల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక దీప్తి హైస్కూల్ ఆవరణలో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పాలకొల్లు జోన్ కార్యదర్శిగా మానేపల్లి శ్రీరామ్, కోశాధికారిగా అందే భాను ప్రకాష్, ఉపాధ్యక్షులుగా వజ్జిపర్తి సాయిబాబు, అడబాల శ్రీమన్నారాయణ, సంయుక్త కార్యదర్శులుగా మేడపాటి జానకిరామ్, మోదిని పద్మిని ఎన్నికయ్యారు. నూతన ప్రెసిడెంట్‌గా ఎన్నికైన గొర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ జోన్ పరిధిలో ఉన్న పాలకొల్లు పట్టణం, పాలకొల్లు మండలం, యలమంచిలి, పోడూరు మండలాల్లో సుమారు 50 ప్రయివేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల సమస్యలు పరిష్కారానికి యూనియన్ కృషి చేస్తుందన్నారు. సమావేశంలో రావూరి అప్పారావు, కేవీ కృష్ణవర్మ, మద్దాల రాంప్రసాద్, రాపాక రత్నరాజు, ఐడియల్ సుబ్బారావు, పంచదార స్వామినాయుడు, బాసిన దుర్గారావు, ప్రగతి రాజు, పోడూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు మేకా శేషుబాబు, డిప్యూటీ కలెక్టర్ దాసి రాజు తదితరులు అభినందించారు.

ఎన్టీఆర్‌కు నివాళి


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన స్థానిక ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు తొలిసారిగా నియోజకవర్గానికి చేరుకున్నారు. బుధవారం రాత్రి 11.30 గంటలకు నియోజకవర్గానికి చేరుకున్న మంత్రి రామానాయుడుకు నియోజకవర్గ ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలోని గాంధీబొమ్మల సెంటర్ వద్దకు చేరుకుని స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రామానాయుడు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు అత్యధిక మెజార్టీని ఇచ్చి మరింత బాధ్యతను పెంచారన్నారు.

మందాలమ్మకు ముత్యాల హారం సమర్పణ


మందాలమ్మకు ముత్యాల హారం సమర్పిస్తున్న దాతలు

పెనుగొండ: వడలి గ్రామదేవ మందాలమ్మకు గ్రామానికి చెందిన వెలిచేటి బుల్లి వెంకట రమణ మూర్తి, అనంత విజయలక్ష్మీ దంపతుల కుమారుడు తరుణ్, కుమార్తె రేణుకా తన్మయ కుటుంబ సభ్యులు 128 గ్రాములు సిల్వర్ ముతాల హారం సమర్పించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో ముత్యాల హారాన్ని అందించినట్లు చెప్పారు. ఆలయాభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వసుధ ఫౌండేషన్ సేవలు ఆదర్శనీయం


జిన్నూరులో ఉచిత టైలరింగ్ శిక్షణా తరగతులను ప్రారంభించిన పెన్మెత్స రామచంద్రరాజు

పోడూరు: వసుధ ఫౌండేషన్ సేవలు ఆదర్శనీయమని ప్రముఖ రైస్‌మిల్లర్ పెన్మెత్స రామచంద్రరాజు అన్నారు. జిన్నూరు గ్రామంలో వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెన్మెత్స బాపిరాజు భవన్‌లో గురువారం నుంచి మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామచంద్రరాజు మాట్లాడుతూ తన తండ్రి పేరున ఉన్న బాపిరాజు భవన్‌లో వసుధ ఫౌండేషన్ మహిళల ఉపాధి కల్పన కోసం టైలరింగ్ శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం తనకు ఎంతో గర్వంగా ఉందన్నారు. వసుధ ఫౌండేషన్ ద్వారా సంస్థ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు పేద వృద్ధులకు, పేద విద్యార్థులకు, ప్రభుత్వ పాఠశాలలకు అనేక సేవాకార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు మాట్లాడుతూ జిన్నూరులో ఉచిత టైలరింగ్ శిక్షణా తరగతులు 3 నెలల పాటు జరుగుతాయన్నారు. జిన్నూరు గ్రామంతో పాటు జిన్నూరుపాలెం, వేడంగి, వేడంగిపాలెం గ్రామాల మహిళలు కూడా ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థికసాయం..

వేడంగిపాలెం గ్రామానికి చెందిన రామారావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారికుటుంబానికి వైద్యఖర్చులు భారం కావడంతో వసుధ ఫౌండేషన్ ద్వారా రూ.7 వేల ఆర్థికసాయంను రైస్‌మిల్లర్ రామచంద్రరాజు చేతుల మీదుగా బాధితుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టైలరింగ్ టీచర్ అరుణ పాల్గొన్నారు.

విద్యార్థిని దత్తత తీసుకున్న కాపు వనిత క్లబ్


దత్తత విద్యార్థిని స్కూల్లో జాయిన్ చేస్తున్న కాపు వనిత క్లబ్ సభ్యురాళ్లు

పాలకొల్లు సెంట్రల్: ఓ పేద విద్యార్థి విద్యకోసం పట్టణ కాపు వనిత సర్వీస్ క్లబ్ సభ్యులు దత్తత తీసుకున్నారు. గురువారం క్లబ్ అధ్యక్షురాలు మంగెన అరుణ మాట్లాడుతూ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన యాగ మైనర్ బాబు అకాల మరణంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. అతని భార్య ఉదయ దుర్గ ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటుంది. ఆమె ఆర్థిక ఇబ్బందులు తమ క్లబ్‌కు తెలియపరచడంతో ఆమె పెద్ద కుమారుడు శ్రీరామ్ కార్తీక్‌కు ఉన్నతమైన విద్యను అందించడానికి కాపు వనిత క్లబ్ దత్తత తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆ విద్యార్థిని స్థానిక ఉల్లంపర్రు గ్రామంలో ఉన్న మాంటిస్సోరి పాటశాలలో చేర్పించగా ఆ పాఠశాల యాజమాన్యం రాయితీ కూడా ఇచ్చిందన్నారు. క్లబ్ సభ్యురాలైన తోట వెంకట అనంతలక్ష్మీ రూ.లక్షతో విద్యార్థిని చదివించడానికి ముందుకు వచ్చారన్నారు. క్లబ్ దత్తత విద్యార్థి ఉన్నత విద్యకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు గణేష్న రాధ, అడబాల జ్యోతి, గంధం మణి, స్కూల్ యాజమాన్యం మద్దాల వాసు, మద్దాల రాంప్రసాద్, ప్రిన్సిపల్ వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వంద రోజులు ఉపాధి పనులు చూపాలి


నడిపూడిలో ఉపాధి పనులు చూపాలని నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: పనిలేని రోజుల్లో ఉపాదిని చూపించే విధంగా తీసుకు వచ్చిన ఉపాధి చట్టాన్ని అమలు చేసి, వందరోజులు పని చూపాలని సీపీఎం పార్టీ మండల కమిటీ సభ్యుడు షేక్ పాదుషా డిమాండ్ చేశారు. గురువారం పెనుగొండ మండలంలోని వ్యవసాయ కార్మిక సంఘంతో కలిసి పలు గ్రామాల్లో ఉపాధి పనులు పరిశీలించారు. పని కావాలని అడిగే వారికి పనులు చూపడం లేదని వ్యవసాయ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని వివరించారు. 20 రోజులు మాత్రమే చేశామని చెబుతున్నారన్నారు. చేసిన పనికి ప్రభుత్వం రూ.300 నిర్ణయించినా, రూ.200 నుంచి రూ.250 మాత్రమే పడుతున్నాయని కార్మికులు చెబుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి వ్యవసాయ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. గురువారం పాఠశాల ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు స్థానిక పానకాల రాయ రామమోహన్ క్లబ్ సభ్యులు నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి-2 శర్మ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వంతో పాటు దాతల సహకారం కూడా ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు గాదె సత్యనారాయణ, మామిడి బాబు, చోడిశెట్టి జ్ఞాన శంకర్, ఎమ్మెస్ కోఆర్డినేటర్ పి జనార్దన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలిలో 'అంగన్‌వాడీ పిలుస్తోంది' ర్యాలీ


యలమంచిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

యలమంచిలి: మూడేళ్లుదాటిన పిల్లలు అందరినీ అంగన్‌వాడీ కేంద్రంలో చేర్చాలని కోరుతూ అంగన్‌వాడీ పిలుస్తోంది పేరిట గురువారం యలమంచిలిలో అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీన మాట్లాడుతూ ఈ నెల 15 వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పిల్లల సమగ్ర ఎదుగుదలకు అవసరమైన ఆహారంతో పాటు బాల్యంలోనే మంచి నడవడిక అలవాటు అవ్వాలంటే పిల్లలు అందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కేవీడీ మల్లీశ్వరి, అంగన్‌వాడీ టీచర్ మహాలక్ష్మి, మహిళా పోలీస్ ఎం.స్నేహ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పంట కాలువ


చినమామిడిపల్లి వద్ద పంటకాలువ చెత్తతో పూడుకుపోయిన దృశ్యం

నరసాపురం: పట్టణం మీదుగా చినమామిడిపల్లి-సరిపల్లి మీదుగా వెళ్లే పంట కాలువ అధ్వానంగా తయారైంది. పంటకాలువలో పూడిక పేరిగిపోవడంతో పాటు కాలువ నిండా చెత్త పేరుకుపోయింది. దీంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని చినమామిడిపల్లి నుంచి కొప్పర్రు వరకూ సుమారు 5 వేల ఎకరాల భూములకు, దాదాపు 40 గ్రామాలకు సాగు, తాగునీటి అవసరాలకు ఈ కాలువే దిక్కు. అయితే ఎక్కడిక్కక్కడ చెత్త పేరుకుపోవడంతో ఇబ్బందిగా మారింది. అయితే ప్రస్తుతం అధికారులు కాలువలకు నీరు కూడా విడుదల చేశారు. మరి కాలువలో తూడు ఎప్పుడు తొలగిస్తారనే విషయం ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా కాలువ బాగు చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలలకు చేరుతున్న విద్యాసామగ్రి


మిషన్ హైస్కూల్ నుంచి ఆటోలో తరలిస్తున్న విద్యాసామగ్రి

నరసాపురం రూరల్: వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించడంతో పాఠశాలల పునః ప్రారంభం నాటికే విద్యాసామగ్రి పాఠశాలలకు చేరింది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా స్కూల్ బ్యాగులు, బూట్లు, పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం, బెల్టులు ఇప్పటికే విద్యాశాఖాధికారులు మండలకేంద్రం నుంచి పాఠశాలలకు చేరవేసే పనిలో ఉన్నారు. ప్రస్తుత ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తే విద్యా సామగ్రిని విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నారు. ఏడు, పదో తరగతులకు అవసరమైన కొన్ని పాఠ్య పుస్తకాలు మినహా మిగిలిన అన్ని పుస్తకాలు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. 9,402 బ్యాగులు, 66,384 నోట్ బుక్స్, 9,714 జతల షూష్, 6,209 బెల్టులు, 60,120 పాఠ్య పుస్తకాలు నరసాపురానికి సంబంధించి అందినట్లు అధికారులు తెలిపారు.


పుస్తకాలను సరిచూసుకుంటున్న సిబ్బంది


పుస్తకాలను అందిస్తున్న సిబ్బంది

పంపిణీకి సిద్ధం



నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోట్ పుస్తకాలు, బెల్టులు, షూస్, బ్యాగులను మండల కేంద్రం నుంచి పాఠశాలలకు పంపుతున్నాం. ఇప్పటి వరకూ 95 శాతం పాఠ్య పుస్తకాలు వచ్చాయి. మిగిలిన పుస్తకాలు మరో రెండు రోజుల్లో రానున్నాయి. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు విద్యార్థులకు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాం.

– జి.జాన్ ప్రభాకర్, ఎంఈఓ, నరసాపురం